సాక్షి బాపట్ల

I

గురువారం । 15 । ఆగస్టు । 2024



## పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ బుధవారం సాయంత్రానికి 40.77 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు గేట్లు మొత్తం మూసివేశారు.



## కాల్వ పూడికతీత

కారెంపూడి: స్థానిక పెదకొదమగుండ్ల మేజర్ కాల్వలో బుధవారం రైతులు పూడికతీత పనులు నిర్వహించారు. కాల్వ చివరి భూముల రైతులే సొంతంగా పనులు చేపట్టారు.



## 49,968 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 49,968 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 47,894 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

# వైద్యమో..రామచంద్రా!

నాపేరు ఏసమ్మ. పట్టణంలోని ఉప్పరపాలెం. ఈనెల 1న ఇంట్లో బాత్‌రూంలో కాలుజారి పడ్డా. చేతికి బలమైన గాయమైంది. తలకు కూడా బొప్పి కట్టింది. చికిత్స కోసం బాపట్ల ఏరియా వైద్యశాలకు వచ్చా. ముందు తలలో బలమైన దెబ్బ తగిలిందేమో తెలుసుకోవడానికి సీటీ స్కాన్‌తో పాటు చేతికి మూడు ఎక్స్‌రేలు తీయాలని వైద్యులు చెప్పారు. వీటిని ఎక్కడ తీస్తారని అడిగితే బయట సాల్మన్ స్కాన్ సెంటర్‌లో తీస్తారని చెప్పి చీటీపై రాసి ఇచ్చారు. అక్కడ రూ. 3500 చెల్లించి స్కానింగ్, ఎక్స్‌రేలు తీయించుకున్నా. తీరా ఆసుపత్రికి వస్తే ఇక్కడ వసతుల్లేవు అని గుంటూరుకు రిఫర్ చేస్తున్నారు. అక్కడకు వెళ్లలేక బాపట్లలోనే ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నా.

- పరికరాలు లేవు..మందులు కరువు
- సక్రమంగా విధులకు హాజరుకాని పరిస్థితి
- సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ కావాలంటే గుంటూరుకు పరుగు
- తరలించేందుకు అంబులెన్స్ కరువు
- మూడు నెలలుగా మెడికల్, సర్జికల్ బడ్జెట్ రాలేదు
- ఆపరేషన్లకు ఇక్కట్లు
- పేషెంట్లకు అరకొర మందులతో సరి
- మిగిలినవి బయట కొనుక్కోవాలంటూ సూచన
- మార్చురీలో ఫ్రీజర్లు కరువు
- పేషెంట్లకు నాసిరకం భోజనం
- పారిశుద్ధ్య నిర్వహణకు నిధులు, సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు లేవు.

### బాపట్ల ఏరియా ఆసుపత్రిలో రోగులకు కష్టాలు

SAKSHI సాక్షి గ్రౌండ్ రిపోర్టు GROUND REPORT

సాక్షి ప్రతినిధి,బాపట్ల/బాపట్ల /బాపట్ల టౌన్ : స్థానిక ఏరియా వైద్యశాలకు జబ్బు చేసింది. పేరుకే ధర్మాసుపత్రి. పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఓ వైపు వైద్యుల నిర్లక్ష్యం, మరోవైపు సిబ్బంది కొరత రోగుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా వైద్యం అందుతుందని పెద్దసంఖ్యలో వస్తున్నప్పటికీ, ఇక్కడ సరైన వైద్యం అందకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రధాన వైద్యశాల అయినప్పటికీ వసతులు సరిగా లేవు. సీటీస్కాన్, ఎంఆర్‌ఐ పరికరాలు కూడా అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు అటు గుంటూరు, ఇటు ఒంగోలు వెళ్లక తప్పడం లేదు.



వైద్యుల కోసం ఎదురు చూస్తున్న రోగులు

**వైద్యం వరకే ఇక్కడ.... మందులు బయటే !**

బాపట్ల జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందిన తర్వాత ఏరియా వైద్యశాలకు రోగుల తాకిడి గణనీయంగా పెరిగింది. జిల్లా కాక మునుపు రోజుకు సగటున 70 నుంచి 120 లోపు మాత్రమే ఉండే ఓపీ ఇప్పుడు 300 పైమాటే. అయితే, ప్రస్తుతం వైద్యశాలలో అన్నిరకాల మందులు అందుబాటులో లేవు. పేషెంట్లకు కొన్ని మందులు మాత్రమే ఇస్తున్నారు. మిగిలినవి బయట మెడికల్ షాపుల్లో కొనుక్కోమని సిబ్బంది చెబుతున్నారు. వైద్యం ఇక్కడ చేయించుకొని, ప్రైవేటు దుకాణంలో మందులు కొనుగోలు చేయాల్సి రావడంతో ఇదేం ఆసుపత్రి అంటూ రోగులు పెదవి విరుస్తున్నారు.

### వైద్యశాలలో ప్రధాన సమస్యలు ఇవి



రక్తనమూనాల కోసం రోగుల ఎదురు చూపులు

- సమస్యలతో బాపట్ల ఏరియా ఆసుపత్రి పేద, మధ్యతరగతి వారికి సరైన వైద్యసేవలు అందించలేక పోతోంది.
- ప్రతిరోజూ 350 నుంచి 400 ఓపీ ఉన్న ఈ ఆసుపత్రిలో 23మంది డాక్టర్లకు గాను 20 మంది మాత్రమే ఉన్నారు.
- జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, పెథాలజిస్ట్ వైద్యులు లేరు.
- ఎక్స్‌రేలో డార్క్‌రూం అసిస్టెంట్లు పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయి. ల్యాబ్ టెక్నీషియన్స్, గ్రేడ్‌వన్ ఫార్మసిస్ట్‌లు లేరు.
- నర్సుల కొరత ఉంది.
- ల్యాబ్ టెక్నీషియన్లు మొత్తం తొమ్మిది మందికి గానూ ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారు ఇటు ల్యాబ్, అటు రక్తనిధి కేంద్రాన్ని చూడాల్సి వస్తుంది.
- ఏరియా వైద్యశాలకు చెందిన అంబులెన్స్ అందుబాటులో లేదు.
- మూడు నెలలుగా సెంట్రల్ డ్రగ్ స్టోర్ గుంటూరు నుంచి మందుల సరఫరా నిలిచిపోయింది.
- మెడికల్ బడ్జెట్ రూ. 10 లక్షలు, సర్జికల్ బడ్జెట్ రూ. 3.90 లక్షలు రావాల్సి ఉన్నా పైసా ఇవ్వలేదు.
- మార్చురీ గదిలో రెండు ఫ్రీజర్లు మాత్రమే ఉన్నాయి. దీంతో మృతదేహాలు పెట్టడం ఇబ్బందిగా ఉంది.
- 1500 చదరపు అడుగుల స్థలం లేకపోవడంతో వైద్యశాలకు అత్యాధునిక వసతులు కల్పించలేకపోతున్నారు.

### సమయపాలన పాటించని వైద్యులు



బాపట్ల ఏరియా ఆసుపత్రి

సోమవారం 9:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ ఏరియా ఆసుపత్రిని సాక్షి బృందం విజిట్ చేసింది. ఇందులో సవాలక్ష సమస్యలు వెలుగుచూశాయి. పేషెంట్లు ఉదయం 8 గంటల నుంచే వచ్చినా 9:30 గంటలకు రావాల్సిన ఎముకల డాక్టర్, చిన్నపిల్లల వైద్యుడు, పంటి డాక్టర్, చర్మవ్యాధి వైద్యుడు, శస్త్రచికిత్స డాక్టర్ తదితరులు 10 గంటలు దాటినా ఓపీకి రాలేదు. కొందరు రౌండ్స్‌లో ఉన్నట్లు సిబ్బంది చెప్పారు. మరికొందరు డాక్టర్లు 11గంటల తర్వాత వచ్చారు. కొందరు అసలు ఓపీలో కనిపించలేదు. దీంతో పేషెంట్లు ప్రధానంగా వృద్ధులు అష్టకష్టాలు పడ్డారు. జనం రద్దీ పెరగడంతో డాక్టర్లను కలవకుండానే కొందరు వెనుదిరిగారు. చర్మవ్యాధిని చూపించుకునేందుకు వచ్చిన పేషెంట్ పిచ్చయ్య డాక్టర్ ఇన్‌టైంలో రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అదే డాక్టర్ కోసం వచ్చిన ఇటికంపాడుకు చెందిన వృద్ధురాలు సుశీల ఉదయం వచ్చానని వాపోయింది.

### లక్షలాది రూపాయల పరికరాలు నిరుపయోగం

బాపట్ల చుట్టుపక్కల ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో సరైన వసతులు అందుబాటులో లేకపోవడంతో కాన్పులకు గర్భవతులు బాపట్ల ఏరియా వైద్యశాల్ని ఆశ్రయిస్తున్నారు. చిన్నపిల్లల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూ. 40 లక్షలతో ఎస్ఎన్‌సీ (స్పెషలైజ్డ్ న్యూబార్న్ కేర్ యూనిట్) ఏర్పాటు చేశారు. అయితే, యూనిట్ పిల్లలకు వైద్యం అందించేవైద్యనిపుణులు నలుగురు, ముగ్గురు స్టాఫ్ నర్స్‌లు, నలుగురు సపోర్టింగ్ నర్సులు లేకపోవడంతో లక్షల ఖర్చుపెట్టి ఏర్పాటుచేసిన యూనిట్ నిరుపయోగంగా ఉంది.



నిరుపయోగంగా ఎస్ఎన్‌సీ యూనిట్

## న్యూస్‌రీల్

### ఢిల్లీ వర్క్‌షాప్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ ప్రసంగం



గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన మహిళా ప్రజాప్రతినిధులతో బుధవారం ఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ఆహ్వానం అందుకున్న ఉమ్మడి గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ సంస్థల తరపున భారత్‌లో గ్రామీణాభివృద్ధికి కార్యాచరణ రూపకల్పనపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆమె ఈ సందర్భంగా ప్రసంగించారు. గ్రామీణ భారత్ అభివృద్ధికి ఆమె పలు సూచనలు ఇచ్చారు.

### నేడు ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం స్వాతంత్య్ర దిన వేడుకల దృష్ట్యా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రమేష్ హాస్పిటల్ నుంచి అంకమ్మనగర్, పట్టాభిపురం, జ్యూట్ మిల్, గుజ్జనగుండ్ల వైపు వెళ్లే వాహనాలు.. నగరంపాలెం ఎస్‌బీఐ జంక్షన్ నుంచి ఐటీసీ, హైవే మెయిన్‌రోడ్డు, చుట్టుగుంట సెంటర్ వద్ద యూటర్న్ తీసుకొని కలెక్టర్ బంగళా, అంకమ్మనగర్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలని సూచించారు. చుట్టుగుంట వైపు నుంచి ఐటీసీ మీదుగా వెళ్లాల్సిన వాహనాలు అదే రోడ్డు దర్గా సమీపంలోని చెక్కలబజార్ మీదుగా వెళ్లాలని చెప్పారు. మెడికల్ కళాశాల నుంచి ఐటీసీకి వెళ్లే వారు ఎస్‌బీఐ వద్ద ఎడమ వైపునకు తిరిగి, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద యూటర్న్ తీసుకోవాలని, ఆపై ఎస్‌బీఐ జంక్షన్ మీదగా ఐటీసీ వైపు వెళ్లాలని కోరారు.

### నేడు పతావిష్కరణ చేయనున్న మంత్రి మనోహర్



నరసరావుపేట: పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో గల కేఎస్‌పీఆర్ జిల్లా క్రీడాప్రాధికార ప్రాంగణంలో 78వ జాతీయ స్వాతంత్య్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. అనంతరం పోలీసు, ఎన్‌సీసీ దళాలచే గౌరవ వందనం స్వీకరించి ప్రజలకు సందేశం ఇస్తారు. మువ్వన్నెల బెలూన్లు ఎగుర వేసి స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తారు. మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

### 'ఉత్తమ' అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని అర్హులైన ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ-2024 అవార్డుకు ఈనెల 20వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యంలో పనిచేసే పాఠశాలల ఉపాధ్యాయులు మినహా మిగిలిన అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 15 సంవత్సరాల బోధనానుభవం ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈఓకు అందజేయాలని తెలిపారు.

### కుడి కాలువకు రెండో వారం నుంచి నీరు విడుదల

సత్తెనపల్లి: సాగర్ కుడి కాలువ పరిధిలోని ఆయకట్టుకు ఈ నెల రెండోవారం నుంచి సాగునీరు విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ప్రాజెక్టు గుంటూరు చీఫ్ ఇంజినీర్ కె.రవి బుధవారం తెలిపారు. కాలువ పరిధిలోని జోన్-1(పల్నాడు, గుంటూరు జిల్లాలు - పమిడిపాడు బ్రాంచ్ కాలువ మినహా) ఈ నెల రెండో వారం నుంచి, జోన్-2 (ప్రకాశం, బాపట్ల జిల్లాలు)కు సెప్టెంబర్ నెల మొదటి వారం నుంచి సాగునీరు విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఆయకట్టు పరిధిలోని రైతులు నారుమడులు, మిర్చి, పత్తి, ఇతర పంటలకు వినియోగించుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

# మంచం పట్టిన ముత్తాయపాలెం



నాపేరు గవిని వెంకటేశ్వరమ్మ. ముత్తాయపాలెం గ్రామం. నాలుగు రోజుల కిందట జ్వరం వచ్చింది. ఊళ్లో చూపించుకున్నా తగ్గలేదు. ఒళ్లంతా నొప్పులు, చలి, జ్వరం. రెండు రోజుల వ్యవధిలోనే తీవ్రమైన నొప్పులు, జ్వరం రావడంతో బాపట్లలోని వైద్యశాలలో చేరా. ఇప్పటికి నాలుగు రోజుల నుంచి చికిత్స పొందుతున్నా. ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా ఉంది. నాతో పాటు మా అమ్మాయి, నా భర్తకు కూడా జ్వరాలు వస్తే వైద్యం చేయించాం.



బాపట్ల ఏరియా వైద్యశాలలో జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు

- ఇంటికొక జ్వర పీడితులు
- ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్న రోగులు
- ఇప్పటికి 10 మందికి పైగా డెంగీ పాజిటివ్
- 50 మందికి పైగా టైఫాయిడ్
- వైరల్ జ్వరాలతో ఊరంతా విలవిల
- తొంగిచూడని వైద్యాధికారులు

బాపట్ల టౌన్: మండలంలోని ముత్తాయపాలెం మంచం పట్టింది. ఊరు మొత్తం జ్వరాలు చుట్టేశాయి. ప్రతి ఇంటికీ ఒకరిద్దరు జ్వరపీడితులు ఉన్నారు.గ్రామానికి చెందిన సుమారు 50 మందికి పైగా టైఫాయిడ్ జ్వరాలతో చీరాల, చెరుకుపల్లి, బాపట్లతోపాటు గుంటూరులో చేరి చికిత్స చేయించుకుంటున్నారు. గ్రామానికి చెందిన లక్ష్మి మూడురోజుల కిందట చీరాల వైద్యశాలలో చేరింది. ఏమాత్రం తగ్గుముఖం పట్టకపోవడంతో గుంటూరులోని కార్పొరేట్ వైద్యశాలలో చేరి చికిత్స పొందుతోంది. వీరితోపాటు గ్రామానికి ఆరుగురు వ్యక్తులు గడిచిన వారం రోజుల్లో వ్యవధిలో చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్సలు పొంది, రెండు రోజుల కిందట ముగ్గురు ఇంటికి వచ్చారు. ప్రస్తుతం ఇద్దరు అక్కడే చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ప్రీతి నర్సింగ్ హోంలో గ్రామానికి చెందిన 10 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. వీరితోపాటు నలుగురు వ్యక్తులు తాజాగా చేరారు.

### పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

పది రోజులుగా ఊరంతా జ్వరాలతో విలవిలలాడుతున్నప్పటికీ కనీసం వైద్యాధికారులు గానీ పంచాయతీ అధికారులు గానీ తొంగిచూసిన దాఖలాలు లేవు. కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవు. దోమల ఉద్ధృతిని తగ్గించేందుకు ఫాగింగ్ కూడా నిర్వహించలేదు. దీంతో అధికారుల తీరుపై గ్రామస్తులు మండిపడుతున్నారు.

**ఇంట్లో అందరికీ జ్వరాలే..**



మా ఇంట్లో అందరికీ గడిచిన నాలుగు రోజులుగా జ్వరాలు. వైద్య పరీక్షలు చేయించుకుంటున్నప్పటికీ తగ్గినట్టే తగ్గుతున్నాయి.. మరలా వస్తున్నాయి. ముందు మనవళ్లకు జ్వరాలు వచ్చాయి. వారికి పూర్తిగా తగ్గుముఖం పట్టకుండానే మా తమ్ముడికి జ్వరం వచ్చింది. వారికి సేవలు చేసేందుకు నేను వస్తే నాకు రెండురోజుల నుంచి ఒళ్లంతా నొప్పులు, చలి, జ్వరం. ఊర్లో ఎవరిని పలకరించినా జ్వరాలు, ఒళ్లంతా నొప్పులు అంటున్నారు.

– కొమ్మనబోయిన సుబ్బరావమ్మ

**వారం రోజులు చీరాలలోనే ఉన్నా**



నాకు వారం రోజుల కిందట జ్వరం వస్తే చీరాలలోని ప్రైవేటు వైద్యశాలలో చేరా. నాకు పూర్తిగా తగ్గకుండానే నా కుమారుడు కోటేశ్వరరావుకు జ్వరం వచ్చింది. ఇద్దరం చీరాలలోని ప్రైవేటు వైద్యశాలలో చేరి అక్కడే వైద్యం చేయించుకున్నాం. అయినప్పటికీ ఇప్పటికీ నీరసం, ఒళ్లు నొప్పులు తగ్గడం లేదు. డాక్టర్లు ఇచ్చిన మందులు వాడుకుంటూ ఇంటి దగ్గరే విశ్రాంతి తీసుకుంటున్నా.

– మారుబోయిన మణెమ్మ

**మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేస్తాం**

ఒక్క గ్రామంలో ఇంత మందికి జ్వరాలు వచ్చిన సంగతి మా దృష్టికి రాలేదు. దీనిపై విచారించి మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తాం. జ్వరాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేంతవరకు వైద్యుల్ని అందుబాటులో ఉంచి గ్రామస్తులకు సేవలు అందిస్తాం. జ్వరాలు ఏ కారణంతో వ్యాపించాయో రక్తపరీక్షలు నిర్వహించి పెరగకుండా చర్యలు తీసుకుంటాం.

– ఎస్. విజయలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌వో

## చట్టబద్ధంగా 'మిషన్ వాత్సల్య' అమలు

కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని చట్టబద్ధంగా అమలు పరచాలని కలెక్టర్ జె వెంకట మురళి అధికారుల్ని ఆదేశించారు. మహిళ, శిశు సంక్షేమశాఖ అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన నిర్వహించారు.జువెనైల్ జస్టిస్ చట్టాన్ని పక్కాగా అమలు చేస్తేనే చిన్నారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. నిరాశ్రయులైన చిన్నారులు, అనాత బాలలు, సమస్యలతో ఇబ్బందులు పడుతున్న చిన్నారుల సంక్షేమ కోసం కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని ప్రారంభించిందని వివరించారు. ఈ పథకం కింద వితంతు పిల్లలు, అనాథలు, విడాకులు పొందిన స్త్రీ పిల్లలు, నిరాదరణకు గురైన వారంతా అర్హులేనన్నారు. ప్రతినెలా రూ. 4,000 పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ పథకం కింద 318 మందికి లబ్ధి చేకూర్చడానికి అవకాశం ఉందని, ప్రస్తుతం 493 దరఖాస్తు వచ్చాయని పేర్కొన్నారు. నిబంధన మేరకు వాటిని పునః పరిశీలించాలని ఆదేశించారు. చిన్నారుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72వేలు, పట్టణ ప్రాంతాలలో రూ.96వేలు ఉన్న వారంతా అర్హులని కలెక్టర్ చెప్పారు. జేజేసీ చట్టం కింద దరఖాస్తుల్ని పరిశీలించిన తర్వాత అర్హత పొందిన వివరాలను నివేదించాలని ఆదేశించారు. బాలల సంక్షేమ మండలి పనితీరుపై ఆరా తీశారు. సమావేశంలో మహిళ సంక్షేమ శాఖ పీడీ ఉమ, బాలల సంక్షేమ మండలి చైర్మన్ ప్రమీల, సభ్యురాలు దుర్గ భవాని, డీసీపీఓ పురుషోత్తం, పీఓ స్వప్నప్రియ పాల్గొన్నారు.

**ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం**

బాపట్ల: ఇన్‌స్పైర్ అవార్డులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. అవార్డుల వివరాలతో వాల్‌పోస్టర్లను బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని ఉపాధ్యాయులకు చెప్పారు. విద్యార్థులు కూడా వినూత్న ఆలోచనలతో అడుగులు ముందుకు వేయాలని ఆయన సూచించారు. విద్యార్థులు ఆవిష్కరించే నూతన ప్రయోగాల వివరాల్ని సెప్టెంబర్ 15వరకు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయవచ్చని తెలిపారు. జాతీయస్థాయిలో ప్రయోగాలు ఎంపికై న విద్యార్థులకు రూ.10వేలు నగదు బహుమతి ఉంటుందని చెప్పారు. 2022లో జిల్లాలోని పిట్టలవానిపాలెం నుంచి విద్యార్థి ఎంపికై బహుమతి పొందినట్లు గుర్తు చేశారు. ఇలాంటి వినూత్న ప్రయోగాలతో విద్యార్థులు విస్తృతంగా ముందుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, జిల్లా ఇంచార్జి డీఈఓ జి. వెంకటేశ్వర్లు, ఆర్డీవో జి. రవీందర్, జిల్లా సైన్స్ అధికారి ఎండీ సాదిక్ పాల్గొన్నారు.

## జెండా ఊంచా రహే హమారా !



మార్టూరు స్టేట్ బ్యాంక్ సెంటర్లో జాతీయ జెండా ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మార్టూరు: స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా మార్టూరుకు చెందిన విద్యార్థులు 200 అడుగుల జాతీయ జెండా ప్రదర్శించారు. స్థానిక హర్షిణి విద్యాసంస్థకు చెందిన వందలాది మంది విద్యార్థులు, ప్రధానోపాధ్యాయురాలు కందిమళ్ల నిర్మల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేసిన రెండు వందల అడుగుల జాతీయ జెండాతో పాఠశాల నుంచి జాతీయ రహదారిపై ర్యాలీగా బయలుదేరి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. స్థానిక వెంకయ్య ఆశ్రమంలో దాతలు పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మైనార్టీ సంక్షేమ సంఘం నాయకుడు గఢ్డం మస్తాన్‌వలి స్వాతంత్య్ర పోరాటంలో నాయకుల వీరోచిత గాథలను విద్యార్థులకు వివరించారు. కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

# పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

- ట్రయల్‌రన్ నిర్వహించిన పోలీస్ యంత్రాంగం
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: పోలీస్ పేరేడ్ గ్రౌండ్ పంద్రాగస్టుకు వేడుకలకు సిద్ధమైంది. గురువారం ఉదయం వేడుకలకు వేదికతో పాటు వివిధ అభివృద్ధి, పథకాలకు సబంధించిన శకటాలు పర్యటించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎస్పీ తుషార్ డూడీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పోలీస్ అధికారులు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి అందించే గౌరవ వందనం ట్రయల్ రన్ నిర్వహించారు. జిల్లా పోలీసులకు వేడుకల్లో నిర్వహించే కవాతుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఏఆర్ డిఎస్పీ ఎస్. చంద్రమోహన్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ రిహార్సల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేడుకల్ని చూడటానికి వచ్చే ప్రజలు, విద్యార్థులకు అసౌకర్యం తలెత్తకుండా పటిష్ట భద్రత చర్యలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

## క్లుప్తంగా

### గ్రానైట్ రాయిపడి కార్మికుడి మృతి


రాయికింద పడి మృతి చెందిన రాజు

బల్లికురవ: వలస కార్మికుడు గ్రానైట్ పరిశ్రమలో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వేమవరం సబ్‌స్టేషన్ సమీపంలోని వెంకటపద్మావతి గ్రానైట్ పరిశ్రమలో రాజస్థాన్‌కు చెందిన రాజు(21) పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి క్వారీ నుంచి తెచ్చిన ముడి రాయిని ఎక్స్‌లేటర్ చైను సహాయంతో లారీ నుంచి దించుతుండగా చైను తెగింది. దీంతో బండ రాయి అతడిపై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే చనిపోయాడు. బుధవారం ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు వైద్యశాలకు అనంతరం రాజస్థాన్ తరలించారు.

### పంచాయతీ నిధులపై శిక్షణ

చినగంజాం: పంచాయతీ నిధులు వినియోగంపై సర్పంచులు, కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కె. స్వరూపరాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన శిక్షణలో మాట్లాడారు. ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, గ్రామ పంచాయతీ అభివృద్ధి పథకాలు, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పథకాలపై మాట్లాడారు.

### 18న కంటి వైద్య శిబిరం

జె.పంగులూరు: రోటరీ క్లబ్ సభ్యుడు గిరిమిడి జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని వారితో ఈ నెల 18న ముప్పవరం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ చిలుకూరి వీరరాఘవయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముప్పవరం గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి పరిషత్ ఎలిమింటరీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో కంటి సమస్యలను పరిశీలించి అవసరమైరన వారికి శుక్లాల ఆపరేషన్‌లు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని చెప్పారు.

### 17,19న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

కారంచేడు: ఈ నెల 17, 19 తేదీల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీన కుంకలమర్రులో జరిగే కాంప్లెక్స్ సమావేశానికి 50 శాతం మంది హాజరుకావాలన్నారు. అలాగే 19వ తేదీన స్వర్ణ స్కూల్ కాంప్లెక్స్‌లో జరిగే సమావేశంలో మిగిలిన 50 శాతం మంది ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అలాగే 17వ తేదీన స్వర్ణ ఉన్నత పాఠశాలలో తెలుగు సబ్జెక్టు కాంప్లెక్స్‌కు కారంచేడు, వేటపాలెం, చీరాల, చినగంజాం, పర్చూరు, ఇంకొల్లు మండలాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు హాజరుకావాలని తెలిపారు.

### హెచ్ఐవీ నియంత్రణతో ఆరోగ్య సమాజం

మార్టూరు: యువత సామాజిక రుగ్మతలను దరిచేరనీయకుండా మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని హెచ్ఐవీ మహమ్మారికి దూరంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక హర్షిణి కళాశాల విద్యార్థులతో బుధవారం నిర్వహించిన మీకు తెలుసా? హెచ్ఐవీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, తదితర చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, ఏపీ సాక్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి, లింక్ వర్కర్ స్కీం స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరామ్ శ్రీనివాసులు హెల్ప్ టీఐ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షణ చూపకుండా ఆదరించాలని వివరించారు. ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, మెడికల్, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది దుర్గ, సల్మా, రూతు, డి.స్వరూప్ పాల్గొన్నారు.

### ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు

చినగంజాం: ఓటరు జాబితాలోని ఫొటోల సవరణలకు సంబంధించి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి పరిశీలన చేయాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర్ రావు తెలియజేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడారు. ఈనెల 20 నుంచి నిర్వహించే ఫొటో ఎలక్టోరల్ రోల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

### టీషర్టుల అందజేత

చీరాల అర్బన్: పట్టణ పరిధిలోని రామకృష్ణాపురంలో ఎంఎస్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలోని పేద విద్యార్థులకు చీరాల ఈజోన్ ఎలక్ట్రానిక్స్ సౌజన్యంతో రూ.15వేల విలువైన టీషర్టులను బుధవారం అందించారు. హెడ్‌మాస్టర్ బాచిన నాగమల్లేశ్వరరావు జోన్ అధినేత చంద్రమౌళి పాఠశాలకు మరింత సహకారం అందిస్తామని చెప్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థి వీరబాబు, ఉపాధ్యాయులు సీహెచ్ శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తి.. కారంచేడు కీర్తి

భారతావని స్వేచ్ఛా విహంగ గీతికై 78వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటోంది. ఎందరో అమరుల నుదిటిన నెత్తిటి తిలకందిద్ది నేటి యువతలో స్ఫూర్తిని రగిలించింది. స్వాతంత్ర్య పోరాటంలో మహనీయుల అలుపెరగని ఉద్యమ దీప్తి.. జిల్లాలో ప్రకాశిస్తోంది. స్వాతంత్ర్య వేడుకలకు ప్రజలు సన్నద్ధమయ్యారు.

- నాటి ఉప్పు సత్యాగ్రహంలో 18 మంది యోధులు
- అడుగడుగునా దేశభక్తిభావం


దండి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న కారంచేడుకు చెందిన యోధులు(ఫైల్)

కారంచేడు: స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ఊరూవాడా కదలింది. ప్రజలు తమకు తోచిన విధంగా ఉద్యమాల్లో పాల్గొని స్వాతంత్ర్య కాంక్షను వెల్లడించారు. నాటి స్వాతంత్ర్య పోరాటాల్లో కారంచేడుకు చెందిన 18 మంది యోధులు పాల్గొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ పిలుపుతో వీరంతా అప్పటి దండి ఉప్పు సత్యాగ్రహంలో పాలు పంచుకున్నారు. గ్రామంలోని పాత శివాలయం వద్ద వీరు సమావేశమైనట్టు చారిత్రక ఆధారాలున్నాయి. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు వీరంతా జైలు జీవితం గడిపారు. నాడు చీరాలకు వచ్చిన మహాత్మాగాంధీని కూడా వీరు కలిసి సత్యాగ్రహం స్ఫూర్తి పొందినట్లు వివరించారు. గ్రామానికి చెందిన యనమండ్ర వెంకటసుబ్బయ్య పంతులు, పోతిని వెంకటసుబ్బయ్య పంతులు, కారంచేటి మల్లయ్య పంతులు నాయకత్వం వహించారు. దండి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న వారిలో దగ్గుబాటి నాయుడమ్మ, యార్లగడ్డ వెంకన్న చౌదరి, పోతిన వెంకన్న చౌదరి, గోరంట్ల వెంకయ్య చౌదరి, యార్లగడ్డ అంజయ్యచౌదరి, గొట్టిపాటి శ్రీరాములు, పోతిన వెంకయ్య చౌదరి, నాళం సుబ్బారావు గుప్తా, యార్లగడ్డ చినలక్ష్మయ్య, యార్లగడ్డ మునసుబుగారి సుబ్బరాయుడు, మండవ మల్లయ్య, దగ్గుబాటి సుబ్బన్న చౌదరి, జాగర్లమూడి వెంకటకృష్ణయ్య చౌదరి, తవ్వా వెంకట సుబ్బయ్య గుప్తా, జాగర్లమూడి వెంకటకృష్ణయ్య చౌదరి పాల్గొన్నట్లు చరిత్ర చెబుతోంది. ఇప్పటికి వారి పేర్లతో ఉన్న శిలాఫలకం కారంచేడు పెద బజారు శివాలయం ప్రహరీపై ఉంది.


సత్యాగ్రహంలో పాల్గొన్న వారి పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకం

## సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే చర్యలు

రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ



చుండూరు(వేమూరు): సోషల్ మీడియాలో అసత్య ప్రచారం పోస్టులు పెడితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ హెచ్చరించారు. చుండూరు పోలీసు స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా చుండూరు మండలంలోని చినపరిమిలో ఘటనకు వివిధ రాజకీయ పార్టీలకు ఆపాదిస్తూ పోస్టులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కొందరు యువకులు పొలం మద్యం తాగి, ఒకరిపై దాడి చేయడంతో పాటు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో ఘటన వెలుగుచూసిందని చెప్పారు. వెంటనే స్పందించిన పోలీస్ శాఖ ఘటన బాధ్యులపై చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అయితే స్నేహితుల మధ్య గొడవను పార్టీల రంగు పులుముతున్నారని పేర్కొన్నారు. ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట చుండూరు సీఐ శ్రీనివాసరావు ఉన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మార్టూరు: మండలంలోని నాగరాజు పల్లి గ్రామంలో ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఏఎస్ఐ మహబూబ్ బాషా బుధవారం తెలిపారు. నాగరాజు పల్లి గ్రామంలోని ఎర్ర చెరువులో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించిన వీఆర్ఏ గల్లా శేషయ్య సమాచారం అందించారు. సుమారు నాలుగు రోజుల క్రితం చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన పురుషునిగా గుర్తించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పారిశుద్ధ్య చర్యలు షురూ



సాక్షిలో ప్రచురించిన కథనం


రావూరిపేటలో రోడ్డుకు ఇరు వైపులా బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వేటపాలెం: రామన్నపేట పంచాయతీ రావూరిపేట శివారులో పారిశుద్ధ్యం లోపించింది. విజృంభిస్తున్న మలేరియా, డెంగీ కేసులపై బుధవారం సాక్షి పత్రికలో 'ఇదిగో దోమలు.. ఎక్కడ డ్రోన్'లు.. కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది ఆ ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్డు పక్కన చెత్త దిబ్బలు తొలగించారు. రోడ్లుకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. రోడ్డుపై నిలిచి పోయిన మురుగు నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టారు.

### గ్రామ రెవెన్యూ సదస్సులు వాయిదా

కారంచేడు: భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన రెవెన్యూ సదస్సులను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తహసీల్దార్ కె. నరసింహారావు తెలిపారు. ముందుగా ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు గ్రామాల్లో సభలు జరుగుతాయని షెడ్యూల్ ప్రకటించామన్నారు. అయితే వాయిదా పడటంతో మరలా ఎప్పుడు ఏయే గ్రామాల్లో సభలు జరుగుతాయో తెలియజేస్తామని పేర్కొన్నారు.

### ఫిజియోథెరపీతో స్వస్థత

బల్లికురవ: వైకల్యం కలిగిన 18 సంవత్సరాల్లోపు చిన్నారులతో నిత్యం వ్యాయామం, ఫిజియోథెరపీ చేయిస్తే స్వస్థత పొందవచ్చని ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం బల్లికురవలోని భవిత కేంద్రంలో పదిమంది చిన్నారులకు వ్యాయామం చేయించారు.

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న జ్ఞాన సుందరం

రేపల్లె రూరల్: అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం నివారించే చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అగ్నిమాపకశాఖ అడిషనల్ డైరెక్టర్ జ్ఞాన సుందరం చెప్పారు. రేపల్లె అగ్నిమాపక కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నామని చెప్పారు. నూతనంగా నిర్మించే భవంతులు, అపార్ట్‌మెంట్‌లు, వ్యాపార సముదాయాలు అగ్నిమాపకశాఖ నిబంధనలకు లోబడి ఉండేలా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీఎఫ్ఓ మధుసూదనరావు, అగ్నిమాపక అధికారి సాంబశివరావు ఉన్నారు.



## న్యాయ సేవాధికార సంస్థ భరోసా

అద్దంకి: ప్రత్యేకావసరాల పిల్లలకు చట్టాల్లో ఎన్నో వెసులుబాట్లు ఉన్నాయని ఎంఈఓ బి. సుధాకర్‌రావు వెల్లడించారు. స్థాని భవిత కేంద్రంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం ఇట్టా రామారావు అధ్యక్షత వహించారు. న్యాయవాది మహమ్మద్ రఫీ మాట్లాడుతూ న్యాయసాధికార సంస్థ అండగా ఉంటుందని చెప్పారు. మార్త శ్రీనివాసరావు, కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవో సుధాకరరావు

## జెడ్పీ హైస్కూల్‌కు క్రీడా పరికరాల అందజేత


క్రీడా పరికరాలను అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో చీరాల రూరల్ మండలం వాడరేవులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎన్నారై గెల్లి శ్రీకృష్ణ రాంకుమార్ ఆర్థిక సహాయంతో రూ.10వేల విలువ గల క్రీడాపరికరాలను బుధవారం అందించారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. విద్యతో పాటు క్రీడలలో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వివరించారు. అనంతరం కబడ్డీ పోటీల్లో పాల్గొన్న బాలుర, బాలికల జట్టుకు విన్నర్స్‌కు ఒక్కో జట్టుకు రూ.1116లు, రన్నర్స్‌కు ఒక్కో జట్టుకు రూ.516 అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు చందలూరి బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్, జీవై ప్రసాద్, హెడ్‌మాస్టర్ కొతవరపు శ్రీనివాసరావు, దండా నారాయణరావు, ఎస్.రవీంద్రబాబు, పి.రామ్‌నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నం ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

జరుబులవారిపాలెం (కారంచేడు): గత 17 సంవత్సరాలుగా దగ్గుబాడు, జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం సమీప గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాత పుస్తకాలు అందిస్తున్న పొన్నం శివకుమార్ ఫౌండేషన్ సహకారం అభినందనీయమని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. బుధవారం జరుబులవారిపాలెం, దగ్గుబాడు మొయిన్ ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పొన్నం వెంకట్రావు మాట్లాడుతూ 2007 నుంచి ఫౌండేషన్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డైరెక్టర్ పొన్నం వెంకట్రావు మాట్లాడుతూ తమ గ్రామాల్లోని పేదల విద్యాభివృద్ధి ధ్యేయం అన్నారు. హెచ్ఎం భవనం శ్రీనివసరెడ్డి, విజయలక్ష్మి, పద్మనాభం, ప్రమీల, మస్తాన్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ పుష్పరాజు, వైస్ చైర్మన్ సుమతి పాల్గొన్నారు.



# ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరాలి


వేటపాలెం సెంటర్‌లో మానవహారంగా విద్యార్థులు


సంతమాగులూరు : పూలమాలలు వేస్తున్న విద్యార్థులు

వేటపాలెం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ప్రతి ఇంటి పై జాతీయ పతకాన్ని ఎగరేయాలని ఎంపీడీఓ ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. బుధవారం హర్ ఘర్ తిరంగా సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ నుంచి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ పతాకాలను చేత పట్టుకొని నినాదాల మధ్య గడియార స్తంభం సెంటర్‌కి చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఎంఈఓ సుబ్బయ్య, హెచ్ఎం వి. ఫణి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**జాతీయ జెండాల పంపిణీ**

అద్దంకి రూరల్: హర్ ఘర్ తిరంగ్ లో భాగంగా బుధవారం బీజేపీ నాయకుడు కె. బంగారుబాబు ఆధ్వర్యంలో అద్దంకి ప్రకాశం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. హర్‌ఘర్ తిరంగ్ పట్టణ కన్వీనర్ కొండ్రగుంట శ్రీనివాసరావు, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మంగమూరి సురేష్, యువమోర్చా బల్లికురవ మండల కన్వీనర్ లోకేష్ పాల్గొన్నారు.


వేటపాలెంలో జాతీయ పతాకాలతో అధికారులు, ఉపాధ్యాయులు


అద్దంకి: జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న నాయకులు

## ఆరోగ్య స్థితిగతులు నమోదు చేయండి

చీరాల టౌన్: పంచాయతీల్లో నివసిస్తున్న ప్రజలతో పాటు 5 ఏళ్లలోపు చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను విధిగా రికార్డుల్లో నమోదు చేయడంతో పాటు టీకాలను సక్రమంగా అందించాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. బుధవారం ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలతో మాట్లాడారు. వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్య స్థితిగతులు, శిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, 5 ఏళ్లలోపు చిన్నారులకు అందించాల్సిన రోగాల నిర్మూలన టీకాలు, రోగనిరోధకశక్తి పెంచే ఇంజక్షన్లను క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. ప్రతి చిన్నారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పలుకరించి చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను విధిగా రికార్డుల్లో నమోదు చేసి నివేదికలు అందించాలన్నారు. ఏ ఒక్క చిన్నారి కూడా అనారోగ్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాల గణాంకాలను వారం రోజుల్లో అందించాలని సూచించారు. పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.